జగనన్నతోనే ప్రగతి సాధ్యం

• కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



జువ్వలదిన్నెలో లబ్ధిదారులకు అందిన పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, పేదల బతుకుల్లో వెలుగులు నిండాలన్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. జువ్వలదిన్నెలో సోమవారం 'గడపగడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల రూపంలో ఇప్పటి వరకు అందిన లబ్ధిని వివరించే బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. స్థానిక సమస్యలపై గ్రామస్తులతో చర్చించి పరిష్కారంపై ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల సంక్షేమం, రాష్ట్ర ప్రగతి పైనే ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలిపారు. అందులో భాగంగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ, గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి పేదల ముంగిటకే పారదర్శక పాలన తీసుకువెళ్లినట్లు తెలిపారు. సచివాలయాలు, వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు నేరుగా పేదల ఇంటి వద్దనే అందుతున్నాయన్నారు. ప్రతి నెలా పింఛన్లు, రేషన్ సరుకులు కూడా ఇంటి వద్దనే అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. పేదరికాన్ని రూపుమాపే దిశగా ఆర్థిక భద్రత కల్పించే పలు పథకాలు ప్రవేశ పెట్టడంతో పాటు మహిళా సాధికారత కోసం ఆసరా, స్వయం ఉపాధి పథకాలు, యువతకు ఉద్యోగ ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నట్లు వివరించారు. పేదల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే లక్ష్యంతో 'నాడు-నేడు' ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కూడా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కావలి మూడో వార్డులో...

కావలి పట్టణంలోని మూడో వార్డులో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించే బుక్‌లెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సర్వే పనులను పరిశీలించిన ట్రైయినీ డిప్యూటీ కలెక్టర్



సోమశిల: జగనన్న శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంలో భాగంగా అనంతసాగరం మండలం బెడుసుపల్లిలో జరుగుతున్న రీసర్వే పనులను ట్రైయినీ డిప్యూటీ కలెక్టర్ ఏ మహేష్ సోమవారం పరిశీలించారు. ఆత్మకూరు డివిజన్ సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసమూర్తితో కలిసి జరుగుతున్న రీ సర్వే పనులను పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. విలేజ్ సర్వేయర్ పృథ్వీ, రైతులు ఉన్నారు.

మండల ప్రత్యేక పూజలు



కలిగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపాళెంలో నూతనంగా నిర్మించిన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించి 41 రోజులు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక వేడుకలు జరిపారు. బ్రహ్మంగారి మఠం నుంచి వచ్చిన అర్చకులు అభిషేకాలు, ప్రత్యేజ పూజలను నిర్వహించారు.

20న చిరుధాన్యాల సాగుపై శిక్షణ

దుత్తలూరు: దుత్తలూరు పరిసర ప్రాంత రైతులకు సీడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20న చిరుధాన్యాల సాగుపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి వేణుగోపాల్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిరుధాన్యాల ఆవశ్యకత, సాగు విధానాలు తదితర అంశాలపై నిపుణులతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. వివరాలకు 9908217465 నంబరులో సంప్రదించాలని ఆయన తెలిపారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్సై విజయ్ శ్రీనివాస్

వరికుంటపాడు: మండలంలోని రామాపురం పంచాయతీ కాకొల్లువారిపల్లి ఎస్సీకాలనీలో మాధవరపు నాగేంద్ర మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ మాధవరపు నాగరాజు తన కుమార్తె జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఉచిత మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఎస్సై విజయ్‌శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ దాతల దాతృత్వం ఎంతో గొప్పదన్నారు. ఈ వాటర్‌ప్లాంటును కాలనీ వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎస్సైని గ్రామస్తులు సన్మానించారు. స్థానికులు మాలకొండయ్య, గోపి, గురుస్వామి, మాలకొండరాయుడు, చంద్రమౌళి, కొండలరావు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్సార్ విద్యార్థుల సేవా కార్యక్రమాలు

బిట్రగుంట: బోగోలు మండలం కడనూతలలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మూడు రోజుల నుంచి కొండబిట్రగుంటలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం సోమవారంతో ముగిసింది. అనంతపురం జేఎన్‌టీయూ ఆదేశాల మేరకు గ్రామంలో మూడు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. శనివారం పచ్చదనం పరిశుభ్రతపైన, ఆదివారం శానిటైజేషన్ పైన, సోమవారం ప్లాస్టిక్ సంచుల నియంత్రణపైన ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి స్థానికులకు అవాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీవీఎస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు ఏ కిరణ్‌కుమార్, వై కిరణ్‌కుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా



చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఏడీఎంహెచ్ఓ వెంకట ప్రసాద్

చేజర్ల: మండలంలోని పాడేరుకు చెందిన ఆశ కుమార్తె అనారోగ్యానికి గురైంది. సోమవారం ఆ చిన్నారిని జిల్లా వైద్యారోగ్యశాఖ అడిషనల్ డీఎంహెచ్ వెంకటప్రసాద్ పరీక్షించారు. ఆ చిన్నారికి గ్రామంలో వైద్యారోగ్య సిబ్బంది 45 రోజుల తర్వాత వేయాల్సిన టీకా 35 రోజులకే వేయడంతో తీవ్ర జ్వరం వచ్చింది. తల్లిదండ్రులు ఓ ప్రైవేట్ వైద్యశాలలో చూపించి చికిత్స అందించారు. ప్రస్తుతం చిన్నారి ఆరోగ్యంగా ఉందన్నారు. అడిషనల్ డీఎంహెచ్ వైద్య సిబ్బంది పనితీరుపై అసహం వ్యక్తం చేశారు. చిత్తలూరు పీహెచ్‌సీలో రికార్డులు, వ్యాక్సిన్ నిల్వను పరిశీలించారు. ఇమ్యూనైజేషన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ చేజర్ల పీహెచ్‌సీ వైద్యురాలు ప్రమీలా రాజకుమారి, డాక్టర్ జ్యోతి, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

1998 డీఎస్సీ ఉపాధ్యాయుడికి సత్కారం



శ్రీనివాసులునాయుడుని సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు జెడ్పీటీసీ సభ్యురాలు పెమ్మసాని ప్రసన్నలక్ష్మీ భర్త శ్రీనివాసులునాయుడు 1998 డీఎస్సీలో ఉపాధ్యాయుడిగా ఎంపికైతే.. ఇటీవల ప్రభుత్వం చేపట్టి ఉపాధ్యాయ నియామకాల్లో చేజర్ల మండలం వావిలేరు పాఠశాల ఉపాధ్యాయుడిగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆత్మకూరు ఎంపీపీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ కంభంశెట్టి ప్రమీల, అప్పారావుపాళెం ఎంపీటీసీ పెమ్మసాని వేణమ్మ, ఆరవేడు, నాగులపాడు సర్పంచ్‌లు సూరం ప్రసాద్‌రెడ్డి, సోమవరపు వెంకటరమణారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులురెడ్డి, పంచాయతీ కార్యదర్శి పల్లవోలు భాస్కర్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈఓగా శ్రీనివాసులు

చేజర్ల: చేజర్ల ఎంఈఓ (ఎఫ్ఏసీ)గా జి. శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాపూరు ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న ఆయన్ను చేజర్ల మండలానికి ఇన్‌చార్జిగా నియమించారు. రెగ్యులర్ ఎంఈఓగా పనిచేస్తున్న కళాధర్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు.

పాఠశాలలు తనిఖీ



బసినేనిపల్లి జెడ్పీ హెచ్ఎస్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ హరిప్రసాద్

సీతారామపురం: మండలంలోని బసినేనిపల్లి, అయ్యవారిపల్లి, ఓగూరువాండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను డిప్యూటీ డీఈఓ హరిప్రసాద్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లోని రికార్డులు పరిశీలించారు. నాడు-నేడు పనులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభ రీతిలో బోధన చేసి ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాడు-నేడు పనులను నాణ్యతగా నిర్వహించాలన్నారు. మెనూ ప్రకారం మంచి పోషక విలువలు ఉన్న ఆహారం విద్యార్థులకు అందించాలన్నారు. పాఠశాల సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఆయన వెంట ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

చెత్త నుంచి సంపద కేంద్రాలను ప్రారంభించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్పీఓ ఆదినారాయణ

ఉదయగిరి: మండలంలోని గ్రామ పంచాయతీల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించి వినియోగంలోకి తేవాలని కావలి డీఎల్పీఓ కె.ఆదినారాయణ సూచించారు. ఆయన సోమవారం మండలంలోని గండిపాళెం చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్త సంపద కేంద్రాల్లో వర్మీకంపోస్ట్ తయారు చేసి రైతులకు విక్రయించి పంచాయతీల ఆదాయాన్ని పెంపొందించుకోవాలన్నారు. కేంద్రాల్లోని ఆవరణ ఖాళీ ప్రదేశాల్లో ఆకు కూరలు, కూరగాయల మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లు ప్రతి రోజు ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్తను సేకరించాలన్నారు. అంతకుముందు ఆయన వెంగళరావునగర్ సచివాలయాన్ని సందర్శించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎం.తిరుపతి, ఆర్.భారతి, ఈఓపీఆర్డీ మల్లికార్జున, పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు గాజులపల్లి అమర్‌నాథ్‌రెడ్డి, బిల్లుపాటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రతి రైతు భూసారాన్ని తెలుసుకోవాలి



భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న ఏఓ వేణుగోపాల్‌రావు



17ఎటికె41 : భూసార పరీక్షలకు మట్టి సేకరణపై అవగాహన కల్పిస్తున్న ఏఓ రజనీ

అల్లూరు: ప్రతి రైతు భూసారాన్ని తెలుసుకోవాలని ఏఓ వేణుగోపాల్‌రావు తెలిపారు. భూసార పరీక్షల ప్రాముఖ్యతపై సోమవారం మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకులకు, రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ భూమి సారాన్ని పరీక్షించుకుంటే మొక్కలను కావాల్సిన పోషకాలను అందించేందుకు, దిగుబడిని పెంచుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఎవరికైనా పంటలు సరిగా పండని భూమి ఉన్నట్లయితే వారి వద్దకు తమ వ్యవసాయ సహాయకులు వచ్చి మట్టి నమూనాను పరీక్ష కేంద్రానికి పంపి వాటిలోని లోపాలకు సరిచేసి అధిక దిగుబడి వచ్చే విధంగా కృషి చేస్తారన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

అనుమసముద్రంపేట: నేల ఆరోగ్యం, భూసార పరీక్షల ప్రాముఖ్యతపై సోమవారం ఏఎస్‌పేటలో వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారిణి రజనీ మాట్లాడుతూ భూసార పరీక్షల వల్ల భూమికి ఏ రకమైన పోషకాలు అవసరమవుతాయో గుర్తించవచ్చని తెలిపారు. మట్టి నమూనాలు సేకరించే సమయంలో కొన్ని జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఆమె వెంట ఏఈఓ చిరంజీవి, వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

నేల ఆరోగ్యమే పంటకు రక్ష

సోమశిల: నేల ఆరోగ్యమే పంటకు రక్ష అని వ్యవసాయాధికారులు అన్నారు. అనంతసాగరం మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో ఏఓ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ వ్యవసాయ సహాయకులకు భూమి ఆరోగ్యం, భూ సార పరీక్షలపై సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతసాగరంలోని రాపూరు బాలరెడ్డి పొలంలో మట్టి తీసే విధానాన్ని వివరించారు. వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

జలదంకి: జలదంకిలో ఆదివారం దీపం అంటుకుని పూరిల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన మహిళ కుంచాల మానసకు పలువురు సోమవారం ఆర్థికసాయం అందించారు. కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ. 20 వేలుసాయం అందించారు. హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షుడు సయ్యద్ ఘనీబాషా మానస కుటుంబానికి 50 కేజీల బియ్యం, నిత్యావసర వస్తువులు, కూరగాయలు, రూ. 2 వేలు అందించారు.

వైద్యశిబిరానికి స్పందన

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం రామానాయుడుపల్లిలో నెల్లూరు మెడికవర్ ఆస్పత్రి కార్డియాలజిస్ట్ డాక్టర్ జయరామ్ మర్రిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి గోపీనాథ్ సహకారంతో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అనంతరం డాక్టర్ జయరామ్ మాట్లాడుతూ వంద మంది వైద్య పరీక్షలు చేయించుకోగా దాదాపు 30 మందికి గుండె సంబంధిత ఇబ్బందులు ఉన్నట్లు గుర్తించామన్నారు. తాత్కాలిక మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, అవసరమైన వారికి ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు. రానున్న రోజుల్లో తన స్వగ్రామం రామానాయుడుపల్లితో పాటు మండలంలో అవసరమైన చోట ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి

• పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి

ఆత్మకూరు: బహుజన సమాజ్ పార్టీని రాష్ట్రంలో బలోపేతం చేసేందుకు విశేష కృషి చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి మందా ఓబులేసు ఆధ్వర్యంలో సోమవారం ముఖ్య నాయకులు, మండలాల పార్టీ బాధ్యులతో సమావేశం నిర్వహించారు. పరంజ్యోతి మాట్లాడుతూ ఇటీవల కొన్ని పార్టీలకు ఎన్నికల కమిషనర్ జాతీయ హోదా తొలగించిందని అయితే బీఎస్పీకి జాతీయ హోదా ఉందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీఎస్పీ అభ్యర్థులు పోటీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి జానకీ ప్రసాద్, మహిళా నాయకురాలు పుష్పాంజలి, బి. శ్రీరామ్ పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

వరికుంటపాడు: మండలంలోని తూర్పుచెన్నంపల్లికి చెందిన ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన తిప్పిరిబోయిన నారాయణ అభ్యకరంగా ప్రవర్తించడంపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్‌శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 14న గ్రామానికి చెందిన ఓ మహిళా ఉద్యోగి ఓ గర్భిణిని చికిత్స నిమిత్తం ఆత్మకూరులోని వైద్యశాలకు నారాయణ కారులో తీసుకెళ్లింది. ఆ సమయంలో నారాయణ ఆ మహిళా ఉద్యోగితో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సవాల్‌గా మారిన చోరీ

- ఆధారాల కోసం సా...గుతున్న అన్వేషణ
- సత్వరమే స్పందించలేని పోలీస్ యంత్రాంగం

కావలి: కావలి పట్టణంలో ఆదివారం సంచలనం సృష్టించిన భారీ దొంగతనం ఘటన పోలీసులకు సవాల్‌గా మారింది. చోరీకి పాల్పడిన నిందితులు చిన్నపాటి క్లూ కూడా వదలకపోవడంతో దర్యాప్తు ముందుకు సాగడం లేదని తెలిసింది. ఫిర్యాదు అందిన వెంటనే ఆగమేఘాల మీద ఘటనా స్థలానికి చేరుకున్న క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ కూడా ఎటువంటి ఆధారాలు కనిపెట్టలేక పోగా, సీసీ కెమెరాల్లో కూడా నిందితుల ఆనవాళ్లు లభించలేదని సమాచారం. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి స్వయంగా ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినా విచారణ మాత్రం వేగం పుంజుకోలేదు. ఆదివారం వేకువన చోరీ జరగ్గా సోమవారం సాయంత్రానికి కూడా పోలీసులు ప్రాథమికంగా ఒక అంచనాకు రాలేకపోయారని తెలిసింది. కావలి పోలీసులతో పాటు సీసీఎస్ అధికారులు కూడా బృందాలుగా ఏర్పడి ఆధారాల సేకరణ కోసం ప్రయత్నిస్తున్నారు.

నిఘా నీడలో ఉన్నా...

చోరీ జరిగిన బృందావనం కాలనీలోని ప్రతీ వీధిని కవర్ చేసేలా హైక్వాలిటీ పీటీజెడ్ సీసీ కెమెరాలు ఉన్నాయి. వీటితో పాటు కాలనీలోకి ప్రవేశించే ప్రధాన రహదారిపైన కూడా పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు చెందిన హైరిజల్యూషన్ కెమెరాలు ఉన్నాయి. రోడ్డు పక్కనే ఉన్న చాలా దుకాణాల్లో కూడా రోడ్డును కవర్ చేసేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఉన్నాయి. ఈ కెమెరాల్లో ఎక్కడో ఒక చోట నిందితుల ఆనవాళ్లు లభించే అవకాశం ఉన్నా పోలీసులు ఆ దిశగా దృష్టి సారించలేదు. కనీసం పూర్తి స్థాయిలో సీసీ ఫుటేజీలు కూడా సేకరించలేదని తెలిసింది. చోరీ జరిగిన బృందావనం కాలనీలోని సీసీ కెమెరాలు కూడా ఇంత వరకు పరిశీలించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

సత్వర స్పందనేది..?

ఏదైనా నేరం జరిగిన వెంటనే పోలీసులు సత్వరమే స్పందించాల్సి ఉంటుంది. ఘటన ఎలా జరిగింది? ఏ సమయంలో జరిగింది? నిందితులు ఎంత మంది? నేరం జరిగిన విధానం, తదితర అన్నీ అంశాలు పరిగణలోకి తీసుకుని సత్వరమే విచారణ చేపట్టాల్సి ఉంటుంది. గతంలో అయితే నేరం జరిగిన విధానాన్ని, సాంకేతిక ఆధారాలను పరిగణలోకి తీసుకుని ఒకటి, రెండు రోజుల్లోనే అనుమానితులను అదుపులోకి తీసుకుని నిజాన్ని రాబట్టేవారు. ప్రస్తుతం మాత్రం సత్వరమే స్పందించే విషయం పక్కన పెడితే అసలు ఎక్కడి నుంచి విచారణ మొదలు పెట్టాలో కూడా అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయి. బృందావనం కాలనీ ఘటనే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. పట్టణ నడిబొడ్డున పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో సెక్యూరిటీ గార్డులు, సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండే కాలనీలోనే భారీ చోరీ జరిగినా పోలీసులు కనిపెట్ట లేకపోయారంటే శివారు ప్రాంతాల పరిస్థితి ఏంటనేది పట్టణ ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది.

సంక్షేమ పథకాలతో పేదలకు ఆర్థిక తోడ్పాటు



నాగినేనిగుంటలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించి బిందెతో నీటిని మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

• ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి పేద కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు అందిందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మర్రిపాడు మండలం సింగనపల్లి సచివాలయం పరిధిలోని మిట్టపాళెం, బాట, యేనేపల్లి, నాగినేనిగుంట గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా నాగినేనిగుంటలో ఎంపీ నిధులతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం చేపట్టిన సంక్షేమ పథకాలు, తద్వారా యువకులు, మహిళలు, విద్యార్థులు పొందుతున్న ప్రయోజనాలను వివరించారు. గ్రామంలోని పలువురు రైతులు భూ సమస్యలపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఈ నెల 21న ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ ఆధ్వర్యంలో మర్రిపాడు, అనంతసాగరం మండలాలకు సంబంధించి ప్రత్యేక రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నామని, అక్కడికి వచ్చి తమ సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. బాట ఎస్సీ కాలనీలో కరెంట్ బిల్లుల సమస్యపై పలువురు మహిళలు ఆయన దృష్టికి తీసుకురావడంతో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సింగనపల్లి సచివాలయం పరిధిలోని గ్రామాల ప్రజలు తమకు ప్రభుత్వం ద్వారా కలిగిన లబ్ధిని ఎమ్మెల్యేకు వివరించారు. పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అండగా నిలబడతామని ఎమ్మెల్యేకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ సిద్ధంరెడ్డి మోహన్‌రెడ్డి, బూదవాడ మాజీ సర్పంచ్ ముట్టుకుందు లక్ష్మీరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ మస్తాన్‌ఖాన్, ఆర్ఐ సురేంద్ర, వెలుగు సీసీ మహాలక్ష్మీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి

ఆత్మకూరురూరల్: సచివాలయాల అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు క్షేత్ర స్థాయిలో సమస్యలను ఎప్పటికప్పుడు సత్వరం పరిష్కరించాలని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మీ, వైస్ ఎంపీపీలు ఉద్దాల పెంచలరావు, కంభంశెట్టి ప్రమీలతో కలిసి సోమవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా తాగునీటి సమస్యలు తలెత్తకుండా, పైపులైన్లు మరమ్మతులు చేయడం, వాల్వ్‌లు బిగించడం, విద్యుత్ సరఫరాలో లోపాలు లేకుండా సరిచూసుకోవడం వంటి కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సచివాలయాల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీలు, కులం, మతం లాంటి వాటితో ప్రమేయం లేకుండా అర్హులందరికి అందజేసి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల్లో మంచి పేరు తేవాలన్నారు. ఆత్మకూరు తహసీల్దారు లక్ష్మీ నరసింహం, విద్యుత్, ఆర్ డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించి పనుల పురోగతిని ఆయా శాఖల ఏఈలు వెంకటేశ్వర్లు, నయోమి, జయరామిరెడ్డి సభకు వివరించారు. సీడీపీఓ జైనకుమారి, ఏసీడీపీఓ సునీలత తమ శాఖకు సంబంధించి చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. మండల వ్యవసాయ అధికారి కిషోర్, ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను తెలిపారు. విద్యుత్‌శాఖలకు సంబంధించి వ్యవసాయ మోటార్లకు రైతులు దరఖాస్తు చేసుకుంటే వారంలోపు కనెక్షన్లు ఇస్తామని ఏఈ వంగల్లు వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో వెన్నవాడ సొసైటీ అధ్యక్షుడు పర్వతరెడ్డి బలరామిరెడ్డి, మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరురూరల్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు మంజూరైన నిధులతో అభివృద్ధి పనులను ఆ గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. పలు కాలనీల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి రూ.20 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చెరుకూరు చిన్న చెంచయ్య, పీఏసీఎస్ సొసైటీ అధ్యక్షుడు వాసిపల్లి లక్ష్మీ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి, బాబుల్‌రెడ్డి, చిల్లూరు వెంకటేశ్వర్లు, వెంకట్రామిరెడ్డి, స్థానిక వలంటీర్లు, స్థానికులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఫైర్ అధికారి



మర్రిపాడులో అగ్నిమాపక పోస్టర్లు ప్రదర్శించి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

ఉదయగిరి: అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఫైర్ అధికారి చంద్రమౌళి సూచించారు. సోమవారం అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని పెట్రోల్ బంక్‌ల వద్ద ఆయన అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అగ్నిప్రమాదాల నివారణ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మహిళలు ఇళ్లలో గ్యాస్‌పై వంట చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం డెమో నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు.

అగ్నిప్రమాదాలు అరికట్టాలి


వింజమూరు (ఉదయగిరి): అగ్నిప్రమాదాలను సకాలంలో నియంత్రిస్తే ఆస్తి, ప్రాణనష్టం నుంచి కాపాడుకోవచ్చునని వింజమూరు అగ్నిమాపక అధికారి పి.జయరామయ్య అన్నారు. వింజమూరులోని శుభోదయ గ్యాస్ ఏజెన్సీ గోదాము, సుభాషిణి ఆయిల్ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద సోమవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. గ్యాస్ సిలిండర్లు లీక్ కావడం వల్ల కలిగే అగ్నిప్రమాదాలను ఎలా నివారించాలో గ్యాస్ సిబ్బందికి తెలియజేశారు.

అగ్నిమాపక పోస్టర్ల ప్రదర్శన


ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం మర్రిపాడులోని నివాస గృహాలు, అపార్ట్‌మెంట్‌లు, వ్యాపార సముదాయాలు వద్ద అగ్నిమాపక అధికారులు పోస్టర్లు ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. మర్రిపాడు అగ్నిమాపక కేంద్రం అధికారి పెంచలయ్య మాట్లాడుతూ వేసవికాలంలో విరామం లేకుండా ఏసీలు, ఫ్రిజ్‌లు ఆన్ చేయడం వల్ల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి అగ్ని ప్రమాదాలు జరుగుతాయన్నారు. ఇళ్లకు నాణ్యమైన ఎలక్ట్రానిక్ వైర్లు మాత్రమే వినియోగించాలన్నారు. అగ్నిమాపక సిబ్బంది రాజేష్, పల్లవోలు బాషా పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం

ఆత్మకూరు: అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఆస్తి నష్టంతో పాటు ఒక్కోసారి ప్రాణనష్టం జరుగుతుందని అప్రమత్తంగా ఉంటే ప్రమాదాలను నివారించవచ్చునని ఆత్మకూరు అగ్నిమాపకశాఖ అధికారి రమేష్‌బాబు తెలిపారు. సోమవారం పెట్రోల్ బంకులు, గ్యాస్ ఏజెన్సీల వద్ద ప్రమాదాల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బంది ప్రదర్శన నిర్వహించారు. వంట గదిలో ప్రమాదాలు సంభవించినప్పుడు ధైర్యంగా సమయస్ఫూర్తితో వ్యవహరించి వాటి బారిన పడకుండా రక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుడు షేక్ నజీర్, పెట్రోల్ బంకుల నిర్వాహకులు, కాలనీ మహిళలు ఉన్నారు.



ఆత్మకూరు: గ్యాస్ ఏజెన్సీ వద్ద అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



శుభోదయ గ్యాస్ ఏజెన్సీ వద్ద మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పీఎం కిసాన్‌పై అవగాహన

కొండాపురం: మండలంలోని సాయిపేట సచివాలయ పరిధిలోని వలంటీర్లతో సోమవారం ఏఓ ప్రసూన సమావేశం నిర్వహించారు. పీఎం కిసాన్ లబ్ధిదారుల నమోదుపై వలంటీర్లకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ కిసాన్ లబ్ధిదారులు తప్పనిసరిగా ఆధార్ లింక్ చేసుకోవాలన్నారు. సాయిపేటలోనే దాదాపు 300 మంది ఆధార్ లింక్ చేసుకోవాల్సి ఉందని వెంటనే అందరూ ఆర్బీకేలో లింక్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవ పాల్గొన్నారు.